సాక్షి యాదాద్రి భువనగిరి

మంగళవారం ◆ 8 ◆ జూలై ◆ 2025



మృత్యుదారులు

రాంగ్‌రూట్, అతివేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్, నిద్రమత్తు వంటి కారణాలతో రోడ్డు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. - 8లో



పెట్రోల్ పోసుకున్న రైతు

తన భూమి వేరే వ్యక్తుల పేరు మీద వెళ్లిందని ఓ రైతు ప్రజావాణి కార్యక్రమంలో ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. - 8లో



గ్రామాల అభివృద్ధే లక్ష్యం

గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. - 9లో

న్యూస్‌రీల్

పాఠశాలను సందర్శించిన జడ్జి

బొమ్మలరామారం : మండలంలోని మల్యాల గ్రామ పరిధిలో గల ఆశీర్ మిషన్ స్కూల్‌ను బుధవారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, జడ్జి మాధవీలత సందర్శించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పేర్కొన్నారు. అనంతరం తుర్కపల్లి మండలం మాధాపూర్‌లోని ఆదరణ బాల సంరక్షణ భవన్‌ను జడ్జి సందర్శించారు. బాలలతో ముఖాముఖి మాట్లాడారు. వారికి కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు.అనంతరం మల్కాపూర్‌లో ఇటుక బట్టీలను సందర్శించారు. బట్టీలో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించి తుర్కపల్లి ఎస్‌హెచ్‌ఓకు సమాచారం అందించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ హెయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నాగరాజు తుర్కపల్లి ఏఎస్ఐ బాల్ నర్సింహ పాల్గొన్నారు.

గుట్ట శివాలయంలో సంప్రదాయ పూజలు



శివాలయంలోని స్పటిక లింగానికి పూజలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదగిరి క్షేత్రానికి అనుబంధంగా ఉన్న శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సంప్రదాయ పూజలు ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించారు. సోమవారం శివుడికి ఇష్టమైన రోజు కావడంతో రుద్రాభిషేకం, బిల్వార్చన, ఆలయ ముఖ మండపంలోని స్పటిక లింగానికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అదే విధంగా ప్రధానాలయంలో నిత్యారాధనలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాతసేవ, గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు అభిషేకం, సహస్రనామార్చన చేశారు. అనంతరం ప్రాకారమండపంలో సుదర్శనహోమం, గజవాహన సేవ, స్వామి, అమ్మవారికి నిత్యకల్యాణం, ముఖ మండపంలో జోడు సేవోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.


అందుబాటులో సరిపడా ఎరువులు

భువనగిరి : రైతుల అవసరాల మేరకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలను ఎరువుల దుకాణంలో అందజేయాలని, విస్తీర్ణాన్ని బట్టి ఎరువులు ఇస్తారని పేర్కొన్నారు. వానాకాలం సీజన్‌కు కావాల్సిన ఎరువులను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుతామన్నారు.

భువనగిరి రూరల్‌కు ఇద్దరు కొత్త ఎస్‌ఐలు

భువనగిరి : భువనగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు కొత్తగా ఇద్దరు ఎస్ఐలు రానున్నారు. ఈ మేరకు సోమవారం రాత్రి రాచకొండ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. 2024 సెప్టెంబర్ 25 నుంచి 2025 జూన్ 30వ తేదీ వరకు శిక్షణ పొందిన కొత్త ఎస్ఐలను పోలీస్ స్టేషన్లకు కేటాయించారు. ఇందులో భాగంగా భువనగిరి రూరల్‌కు ఒరుగంటి సంధ్య, కట్ట శివశంకర్‌రెడ్డి రానున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బియ్యం ఎగుమతుల్లో వేగం పెంచండి



మిల్లర్లతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

రామన్నపేట : గత వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి బియ్యం ఎగుమతులను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి సూచించారు. సోమవారం రామన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో రామన్నపేట, వలిగొండ మండలాల పరిధిలోని మిల్లర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వీలైనంత త్వరగా సీఎంఆర్ బకాయిలు అప్పగించాలని ఆదేశించారు. అనంతరం రెవెన్యూ అధికారులతో సమావేశం అయ్యారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ప్రతి దరఖాస్తుకు పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ లాల్‌బహదూర్‌శాస్త్రి, డిప్యూటీ తహసీల్దార్ శైలజ, సీనియర్ అసిస్టెంట్ గాలయ్య ఆర్ఐలు శోభ, రాజేశ్వర్ పాల్గొన్నారు.

కడుపులోనే.. కాటికి!

పెరుగుతున్న భ్రూణ హత్యలు

- ఆడపిల్ల అని తెలియగానే గర్భంలోనే పిండం తొలగింపు
- కాసుల కక్కుర్తితో ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లలో విచ్చలవిడిగా లింగనిర్ధారణ పరీక్షలు
- తనిఖీల్లో వెలుగుచూస్తున్నా కఠిన చర్యలు తీసుకోని వైద్యారోగ్య శాఖ అధికారులు



గాయత్రి ఆస్పత్రి సిబ్బందిని విచారిస్తున్న వైద్యారోగ్య శాఖ అధికారులు, పోలీసులు

సాక్షి యాదాద్రి : చట్టరీత్యా నేరమని తెలిసినా కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లు కాసులకు కక్కుర్తిపడి విచ్చలవిడిగా లింగ నిర్ధారణ పరీక్షలకు పాల్పడుతున్నాయి. పుట్టబోయేది ఆడబిడ్డా, మగబిడ్డా అని స్కానింగ్ ద్వారా ముందే చెప్పేస్తున్నాయి. ఆడపిల్లయితే గర్భంలోనే ఊపిరి తీస్తున్నారు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఇద్దరు గర్భిణులకు అబార్షన్ చేయడం ఎస్ఓటీ పోలీసుల దాడుల్లో బట్టబయలైంది. జిల్లాలో లింగ నిర్ధారణకు సంబంధించి గతంలోనూ అనేక కేసులు వెలుగుచూశాయి.

సీజ్ చేసినా మరో పేరుతో ఓపెన్

జిల్లాలో పలు ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లు, ప్రైవేట్ ఆస్పత్రుల్లో విచ్చలవిడిగా లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నాయి. కనీస వైద్య అర్హత లేకుండా నిర్వహిస్తున్నారు. గతంలో తుర్కపల్లి మండలం మాదాపూర్‌లో, చౌటుప్పల్ పట్టణంలో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించి అబార్షన్ చేసినట్లు బట్టబయలు కావడంతో ఆస్పత్రులను సీజ్ చేసి ర్వాహకులపై కేసులు నమోదు చేశారు. అయితే సదరు వ్యక్తులు మరో పేరుతో ఆస్పత్రులు తెరిచి అమానవీయ దందా నిర్వహిస్తున్నారు. భువనగిరితో పాటు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల నుంచి ప్రత్యేక వాహనాల్లో అవసరమైన చోటకు స్కానింగ్ మిషన్లు తీసుకువెళ్లి లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయ్..

జిల్లాలో మెటర్నిటీ నర్సింగ్ హోంలు, స్కానింగ్ సెంటర్లు 41 ఉన్నాయి. ఇందులో స్కానింగ్ పరీక్షలు చేయడానికి 14 నర్సింగ్‌హోంలకు మాత్రమే అనుమతి ఉంది. కానీ, ఎలాంటి అనుమతి లేకుండా ప్రైవేట్ ఆస్పత్రులు, ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లు పుట్టగొడుగల్లా పుట్టుకొస్తున్నాయి. జిల్లా వైద్యాధికారి మారినప్పుడల్లా తనిఖీల పేరిట హడావుడి చేయడం.. ఆ తర్వాత మౌనంగా ఉండటం పరిపాటిగా మారుతుంది. మూడు నెలల క్రితం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నోస్టిక్ సెంటర్లు, ల్యాబ్‌ల్లో తనిఖీలు నిర్వహించగా అక్రమాలు వెలుగుచూశాయి. కానీ, ఏ ఒక్కరిపై చర్యలు తీసుకోలేదు. సిద్దిపేట, మేడ్చల్ మల్కాజిగిరి, జనగామ, నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి జిల్లాల నుంచి వచ్చి అబార్షన్లు చేయించుకొని పోతున్నట్లు తెలుస్తోంది. అయినా వైద్యారోగ్య శాఖ అధికారుల్లో చలనం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

అబార్షన్ చేసినందుకు రూ.50 వేలు

స్కానింగ్‌లో ఆడపిల్ల అని తేలితే అబార్షన్ చేయడానికి నిర్వాహకులు రూ.వేలల్లో వసూలు చేస్తున్నారు. ఒక అబార్షన్‌కు రూ.50 వేల వరకు తీసుకుంటున్నారు. గర్భిణులకు తీసుకువచ్చేందుకు గ్రామాల వారీగా ఏజెంట్లను నియమించుకున్నారు. స్కానింగ్‌కు రూ.15 వేలు, ఆస్పత్రిలో ఉన్నందుకు, డాక్టర్ ఫీజు రూ.30 వేలు, ఏజెంటుకు రూ.5 వేలు వసూలు చేస్తున్నారు.

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



భ్రూణహత్యలు వెలుగుచూడటం బాధాకరం. ఇప్పటికే జిల్లాలో బాలికల నిష్పత్తి తగ్గుతుంది. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ దీన్ని తీవ్రంగా పరిగణిస్తోంది. విద్యావంతులు, సమాజానికి సేవలందించేవారు కూడా ఆడిపిల్లలపై వివక్ష చూపుతుండటం బాధాకరం. లింగనిర్ధారణ ద్వారా అబార్షన్లు చేయించినా, చేసినా కఠిన చర్యలు తప్పవు.

–బండారు జయశ్రీ, మహిళా, శిశు సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్

భువనగిరిలోని గాయత్రి హాస్పిటల్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు



స్కానింగ్ మిషన్ గదిని సీజ్ చేస్తున్న పోలీసులు

భువనగిరి : జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో లింగ నిర్ధారణ పరీక్షలు చేసి, ఇద్దరు గర్భిణులకు అబార్షన్ చేసిన ఎస్ఓటీ పోలీసుల దాడుల్లో వెలుగుచూసింది. పోలీసులు, వైద్యాధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం అర్ధరాత్రి భువనగిరిలోని గాయత్రి ఆస్పత్రిలో అబార్షన్ చేస్తున్నారని అందిన సమాచారం మేరకు ఎస్ఓటీ పోలీసులు ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించారు. ఆ సమయంలో ఇద్దరు గర్భిణులకు అబార్షన్ చేసి వైద్యుల పర్యవేక్షణలో ఉంచినట్లు గుర్తించారు. ఆస్పత్రి వైద్యుడు హీరేకార్ శివకుమార్‌ను అదుపులోకి తీసుకుని పట్టణ పోలీసులకు అప్పగించారు. సోమవారం ఉదయం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యశోద, గైనాలజిస్ట్ మాలతి, డెమో అంజయ్య పోలీసుల ఆధ్వర్యంలో ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించి వైద్యులు, సిబ్బంది, బాధిత మహిళలను విచారణ చేశారు. పట్టణంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి డయాగ్నోస్టిక్ సెంటర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారని తేలడంతో అక్కడా తనిఖీలు నిర్వహించారు. రికార్డులను పరిశీలించి డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్వాహకుడు దంతూరి పాండును విచారించారు. జూన్ 30న ఒకరు, ఈనెల 3వ తేదీన మరోకరు స్కానింగ్ కోసం వచ్చినట్లు గుర్తించారు. ఆ ఇద్దరు మహిళలు గాయత్రి ఆస్పత్రి వైద్యులను చికిత్స కోసం వేర్వేరుగా సంప్రదించారు. వారికి చెప్పిన ప్రకారం ఇద్దరు మహిళలకు ఆదివారం అర్ధరాత్రి చికిత్స చేశారు. ఆస్పత్రి, స్కానింగ్ సెంటర్‌లో రికార్డులు, కంప్యూటర్, హార్డ్ డిస్క్‌లు స్వాధీనం చేసుకున్నారు. స్కానింగ్ మిషన్ ల్యాబ్‌ను సీజ్ చేశారు. గాయత్రి ఆస్పత్రి వైద్యుడు శివకుమార్, డయాగ్నోస్టిక్ సెంటర్ నిర్వాహకుడు దంతూరి పాండుపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భువనగిరి పట్టణ సీఐ రమేష్ తెలిపారు. అలాగే డాక్టర్ గాయత్రితో పాటు ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఫోరెనిక్స్ ల్యాబ్‌కు పిండాలు

అబార్షన్ చేయించుకున్న మహిళ పిండాలను డీఎన్ఏ పరీక్షల నిమితం ఫోరెనిక్స్ ల్యాబ్‌కు పంపనున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యశోద తెలిపారు. డాక్టర్ శివకుమార్ చికిత్స చేయడానికి అర్హత లేదని, సర్టిఫికెట్ ప్రకారం ఆస్పత్రిలో వైద్యులు లేరని వెల్లడించారు. అబార్షన్ చేయించుకున్న ఇద్దరు మహిళల్లో ఒకరికి ఇప్పటికే ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారని, మరొకరికి ఇక ఆడ పిల్ల ఉన్నారని పేర్కొన్నారు.

అత్యధికంగా భూ సమస్యలపైనే..



ప్రజల నుంచి వినతులు స్వీకరించి పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

- ప్రజావాణికి 48 అర్జీలు
- వినతులు స్వీకరించిన కలెక్టర్

సాక్షి, యాదాద్రి: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చి వినతిపత్రాలు అందజేశారు. వివిధ సమస్యలపై 48 అర్జీలు రాగా.. అందులో భూ సమస్యలకు సంబంధించి 34 ఉన్నాయి. కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఇతర జిల్లా ఉన్నతాధికారులు అర్జీలను స్వీకరించారు.

ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు అందిన దరఖాస్తులకు ప్రాధాన్యమివ్వండి

ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు ఆయా వర్గాల నుంచి అందిన వినతులకు ప్రాధాన్యమిచ్చి త్వరగా పరిష్కారం చూపాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. అదే విధంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయించాలని, వనమహోత్సవం కార్యక్రమంలో లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని సూచించారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ స్కూళ్లపై ప్రజల్లో నమ్మకం పెరిగిందని, ప్రైవేట్ పాఠశాలల నుంచి చాలా మంది విద్యార్థులు సర్కారు బడుల్లో చేరుతున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నాణ్యమైన విద్య అందించాలన్నారు.

పాస్ పుస్తకం ఇప్పించాలని వినతి..

పాస్ పుస్తకం ఇప్పించాలని బొమ్మలరామరం మండల కేంద్రానికి చెందిన ముక్కెర్ల బాలయ్య కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. పక్కనే ఉన్న పేలుడు పదార్థాల కంపెనీ యజమాని తన భూమి అమ్మాలని వత్తిడి తెస్తున్నాడని ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా కంపెనీ యజమానికి అనుకూలంగా మాట్లాడుతున్నారని, తనకు న్యాయం చేయాలని విన్నవించారు. విచారణ చేయాలని ఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు.

మహిళా శక్తి సంబరాలకు ఏర్పాట్లు చేయండి

- కలెక్టర్ హనుమంతరావు



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

సాక్షి, యాదాద్రి : ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సంబరాలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. భువనగిరిలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో సోమవారం జరిగిన మహిళా స్వయం సహాయక సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. మహిళా శక్తి పథకం కింద త్వరలో పెట్రోల్ బంకులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేని కుటుంబాలకు స్వయం సహాయక సంఘాలు, స్త్రీనిధి రుణాలు ఇవ్వాలని సూచించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో మహిళా సమాఖ్య భవనం నిర్మిస్తామని చెప్పారు. ఈనెల 10నుంచి 16వ తేదీ వరకు సంబరాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి, విజిలెన్స్ అధికారి ఉపేందర్‌రెడ్డి, అడిషనల్ డీఆర్‌డీఓ సురేష్, ఎంపీడీఓలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

భువనగిరి : నిరుద్యోగ యువతీయువకులు తమ విద్యార్హతల వివరాలను డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. డిజిటల్ ఎప్లాయిమెంట్ ఎక్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ పోర్టల్ పోస్టర్‌ను అదనపు కలెక్టర్ వీరారెడ్డి, పరిశ్రమల జిల్లా మేనేజర్ రవీందర్, జెడ్పీ సీఈఓ శోభారాణితో కలిసి ఆవిష్కరించారు. నిరుద్యోగులు పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవడం వల్ల ప్రభుత్వ శాఖల్లో ఖాళీల వివరాలు తెలుస్తాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



వనమహోత్సవంలో పాల్గొన్న ఇంటర్‌బోర్డు జాయింట్ సెక్రటరీ భీమ్‌సింగ్

భూదాన్‌పోచంపల్లి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఇంటర్ బోర్డు జాయింట్ సెక్రటరీ భీమ్‌సింగ్ సూచించారు. సోమవారం భూదాన్‌పోచంపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. విద్యార్థులు చదువుతో పాటు పర్యావరణ పరిరక్షణపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్‌రెడ్డి, సీనియర్ అధ్యాపకులు హరిప్రసాద్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్లు జ్యోతి, సాయివర్ధన్, స్టూడెంట్ కౌన్సిలర్ సంతోష్‌కుమార్, అధ్యాపకులు చందన, శ్రీదేవి, శివశంకర్, స్వాతి, రేణుకదేవి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడి సన్నిధిలో రామచంద్రజీయర్ స్వామీజీ



ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న రామచంద్ర జీయర్ స్వామీజీ

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జీయర్ మఠం పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ త్రిదండి రామచంద్రజీయర్ స్వామీజీ సోమవారం దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముఖమండపంలో ఉత్సవమూర్తుల చెంత అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. స్వామీజీకి అర్చకులు వేద పారాయణం చేశారు. అంతకుముందు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ.. ప్రతి ఆలయంలో భగవంతుడు కొలువై ఉంటాడని, కానీ యాదగిరి క్షేత్రంలో భగవంతుడితో పాటు ఆళ్వార్లు సైతం కొలువై ఉండటం ఆలయ విశిష్టత అని వెల్లడించారు. చాతుర్మాసా దీక్ష ప్రారంభమాసంలో శ్రీస్వామి వారిని దర్శించుకుని ధన్యులమైనట్లుగా స్వామీజీ పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా సంపత్‌కుమార్



నల్లగొండ : కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి నల్లగొండ ఇన్‌చార్జిగా.. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ నియామకం అయ్యారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఉమ్మడి జిల్లాలకు ఇన్‌చార్జిలను నియమించింది. ఈ మేరకు పది ఉమ్మడి జిల్లాలకు ఇన్‌చార్జిలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఏఐసీసీ సెక్రటరీ ఎస్.సంపత్‌కుమార్ నియమితులయ్యారు.

కొండమడుగు కార్యదర్శి సస్పెన్షన్

- ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి మూల్యం
- 'సాక్షి' కథనంతో స్పందించిన కలెక్టర్



పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కొండమడుగు గ్రామస్తులు

సాక్షి ఎఫెక్ట్..

బీబీనగర్: మండలంలోని కొండమడుగు గ్రామ పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ హనుమంతరావు ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ నిధులు పక్కదారి పట్టడంతో పాటు సుమారు రూ.93,40,377 దుర్వినియోగం తదితర ఆరోపణలపై మూడు నెలల క్రితం డీఎల్‌పీ విచారణ నిర్వహించారు. నిధులు దుర్వినియోగమైనట్లు నిర్ధారించి డీపీఓకు నివేదిక అందజేశారు. అయినా ఇప్పటికే పంచాయతీ కార్యదర్శిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనిపై 'నిధులు పక్కదారి – ఏదీ రికవరీ' శీర్షికతో ఈనెల 6న సాక్షి దినపత్రిక కథనం ప్రచురించింది. ఈ మేరకు స్పందించిన కలెక్టర్.. పంచాయతీ కార్యదర్శి అలివేలును సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా గ్రామ ప్రత్యేకాధికారిగా ఉన్న ఏంపీఓ మదీద్‌కు కూడా షోకాజ్ నోటీసు జారీ చేశారు. మదీద్‌ను ఎందుకు సస్పెండ్ చేయకూడదో వివరణ ఇవ్వాలంటూ నోటీసులో పేర్కొన్నారు. నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేయాలని డిప్యూటీ సీఈఓ విష్ణువర్ధన్‌రెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా మేజర్ గ్రామ పంచాయతీల్లో నిధుల ఖర్చుపై విచారణ జరపాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుకు సూచించారు. అధికారులు అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.

సమగ్ర విచారణ చేయించాలి

గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనం చూసి కొండమడుగు గ్రామస్తులకు పెద్ద సంఖ్యలో ప్రజావాణికి తరలివచ్చారు. పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని, నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ చేయించాలని కలెక్టర్ హనుమంతరావుకు వినతిపత్రం అందజేశారు.

ఏసీబీకి చిక్కుతున్నా లంచాలు ఆగట్లే

ఉమ్మడి జిల్లాలో నెలకొకరు చొప్పున పట్టుబడుతున్న అధికారులు

- అత్యధికంగా రెవెన్యూ, పోలీస్, విద్యుత్, రిజిస్ట్రేషన్ శాఖల్లోనే..
- కేసులు నమోదు చేస్తున్నా మారని తీరు
- తాజాగా పట్టుబడిన మిర్యాలగూడ సివిల్ సప్లయీస్ డీటీ



పీడీఎస్ బియ్యం రవాణా చేస్తూ పట్టుబడి సీజ్ అయిన లారీలను విడిపించేందుకు మిర్యాలగూడ సివిల్ సప్లయీస్ డిప్యూటీ తహసీల్దార్ జావెద్ రూ.70 వేలు డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం జావేద్‌ను అరెస్ట్ చేసిన ఏసీబీ అధికారులు నల్లగొండ డీఎస్‌ఓ ఆఫీస్ కార్యాలయంలో, జావెద్ ఇంట్లో సోదాలు చేశారు. సోమవారం జావేద్‌ను కోర్టులో హాజరు పరచనున్నారు.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ప్రజల కోసం పని చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు లంచావతారులుగా మారుతున్నారు. అవినీతికి పాల్పడుతూ ఉమ్మడి జిల్లాలో నెలకొకరు ఏసీబీ వలకు చిక్కుతున్నారు. నెలవారీ వేతనాలు వస్తున్నా.. పనుల కోసం తమ వద్దకు వచ్చిన వారిని ఇబ్బందులకు గురి చేస్తుండటంతో బాధితులు ఏసీబీ అధికారులను ఆశ్రయిస్తున్నారు. దీంతో వారిని ఏసీబీ అధికారులు పట్టుకొని అరెస్ట్ చేస్తున్నప్పటికీ అవినీతి అధికారుల్లో మార్పు రావడం లేదు. గడిచిన రెండేళ్లలో 18 వరకు ఏసీబీ కేసులు నమోదయ్యాయి. 2024లో 11 మంది అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడగా.. ఈ ఏడాది ఇప్పటి వరకు ఏడుగురు ఏసీబీ వలలో చిక్కారు.

జిల్లాలో ఈ ఏడాది కేసులు ఇలా...

- తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో జనవరి 12వ తేదీన పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా కేసులో లంచం తీసుకుంటూ ఎస్ఐ సురేష్, కానిస్టేబుల్ నాగరాజు పట్టుబడ్డారు. ఈ కేసులో ఓ వ్యక్తి వద్ద రూ.1.40 లక్షల ముడుపులకు ఒప్పందం కుదుర్చుకొని రూ.70 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.
- చౌటుప్పల్‌లో మార్చి 6వ తేదీన ట్రాన్స్‌కో ఏడీ శ్యాంప్రసాద్ రూ.70 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని ఓ ఫార్మా పరిశ్రమకు విద్యుత్ బకాయిలు క్లియరెన్స్ ఇవ్వడంతో పాటు మీటర్ పునరుద్ధరణకు లంచం డిమాండ్ చేయగా, బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో లంచం ఇస్తుండగా పట్టుకున్నారు.
- ఏప్రిల్ నెలలో రేషన్‌బియ్యం అక్రమంగా తరలిస్తున్న కేసులో చింతలపాలెం పోలీస్‌స్టేషన్‌లో ఒక వ్యక్తికి బెయిల్ ఇచ్చేందుకు రూ.10 వేలు లంచం తీసుకుంటున్న ఎస్ఐ అంతిరెడ్డిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు.
- సూర్యాపేట జిల్లా కేంద్రంలో నకిలీ వైద్యుల కేసులో సూర్యాపేట పట్టణ సీఐ వీర రాఘవులు, సూర్యాపేట డీఎస్పీ పార్థసారథి రూ.16 లక్షలు లంచం డిమాండ్ చేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేశారు. దీంతో ఏసీబీ అధికారులు పక్కా ఆధారాలతో మే 12వ తేదీన వారిని పట్టుకున్నారు.
- పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారంలో పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్ ఒక వ్యక్తి నుంచి రూ.8 వేలు లంచం డిమాండ్ చేశాడని ఫిర్యాదు రావడంతో జూన్ 26న ఏసీబీ అధికారులు దాడి చేసి సతీష్‌ను పట్టుకున్నారు.
- గత నెల 28న హుజూర్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి కంప్యూటర్ ఆపరేటర్ (అవుట్‌సోర్సింగ్) విజేతారెడ్డి రూ.12 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు.

అవినీతి ఎక్కువగా ఈ శాఖల్లో..

ఉమ్మడి జిల్లాలో పోలీసు, రెవెన్యూ, విద్యుత్, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు ఎక్కువగా ఏసీబీకి చిక్కుతున్నారు. కేసులు నమోదు చేసిన అనంతరం ప్రభుత్వం కొన్ని నెలల తర్వాత సదరు ఉద్యోగులకు బాధ్యతలు అప్పగిస్తోంది. కొంతమంది ప్రజాప్రతినిధులను మచ్చిక చేసుకొని పోస్టింగ్ పొందుతున్నారు. కోర్టుల్లో కేసుల విచారణకు సుమారు ఏడాది నుంచి రెండేళ్ల కాలం పడుతుండగా.. కొంత మందికి మాత్రమే శిక్షపడుతోంది. మరికొన్ని కేసులు కోర్టుల్లో నిలబడడం లేదు.



మృత్యు దారులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17 రోజుల్లో 29 మంది మృతి

భయపెడుతున్న రోడ్డు ప్రమాదాలు

- అతివేగం, మద్యంమత్తు, రోడ్ల వెంట వాహనాలు నిలపడమే కారణం
- ఛిన్నాభిన్నమవుతున్న బాధిత కుటుంబాలు

ఉమ్మడి జిల్లాలో నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. రాంగ్‌రూట్ ప్రయాణాలు, అతివేగం, డ్రైవింగ్‌లో నిర్లక్ష్యం, నిద్రమత్తు, రోడ్డు వెంట లారీలు నిలపడం లాంటి వాటితో ప్రమాదాలకు కారణాలు. గత నెల జూన్ 20వ తేదీ నుంచి ఈనెల 5వ తేదీ వరకు చూస్తే ఉమ్మడి జిల్లాలో రోడ్డు ప్రమాద ఘటనల్లోనే ఎక్కువ మంది మృతి చెందారు. ముఖ్యంగా మృత్యువాత పడ్డ వారిలో యువతే ఎక్కువగా ఉంటున్నారు. గతేడాది రోడ్డు ప్రమాదాలు తగ్గినా ఇటీవల అధికంగా రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

సూర్యాపేటటౌన్ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గడిచిన పదిహేడు రోజుల్లో రోడ్డు ప్రమాదాల్లో 29 మంది మృతి చెందారు. జూన్ 21వ తేదీ నుంచి ఈ నెల 5వ తేదీ వరకు అనేక రోడ్డు ప్రమాదాలు జరిగగా ఈ ఘటనల్లో తీవ్ర గాయాలపాలై మృత్యువాత పడ్డారు. అనుకోకుండా జరిగిన రోడ్డు ప్రమాదాలు బాధిత కుటుంబాల్లో చీకట్లు మిగుల్చుతున్నాయి. ఎంతో మంది వైకల్యంతో బాధపడుతున్నారు.

ప్రమాదాలకు కారణాలు ఇవీ..

ముఖ్యంగా అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ రోడ్డు ప్రమాదాలకు కారణం. అదేవిధంగా జాతీయ రహదారుల వెంట లారీలు, ఇతర వాహనాలు నిలపడంతో వెనుక నుంచి వచ్చే వాహనాలు వాటిని గమనించకుండా ఢీకొడుతున్నాయి. ఇటీవల ఇలాంటి ప్రమాద ఘటనలు చాలా సంభవించాయి. ఈ ప్రమాదాల్లో ఎంతో మంది సైతం మృత్యువాత పడ్డారు. అలాగే రాంగ్‌రూట్ ప్రయాణం, నిద్ర మత్తు, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడంలాంటి కారణాలతో జిల్లాలో అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

సూచిక బోర్డులు లేక ఎన్నో ప్రమాదాలు..

జిల్లా కేంద్రాల నుంచి ఇతర గ్రామాలకు వెళ్లే రహదారుల్లో అనేక మూలమలుపులు ఉన్నాయి. అక్కడ ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళ ప్రయాణం చేసేటప్పుడు మూలమలుపు వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేక బైక్‌లు అదుపు తప్పి కిందపడిన ఘటనలు ఉన్నాయి.

గత నెలలో ఉమ్మడి జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలు..

- జూన్ 21న మర్రిగూడ మండలం కేంద్రానికి చెందిన యాచారం శ్రీరాములు అదే గ్రామానికి చెందిన బోయపల్లి శంకర్ సంగారెడ్డిలో డీసీఎంలో బొగ్గు లోడ్ చేసుకొని తిరిగి వస్తున్నారు. కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓటర్ రింగ్ రోడ్డు వద్దకు రాగానే వెనుక నుంచి లారీ వచ్చి డీసీఎంను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీరాములు గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు.
- జూన్ 21న మునగాల మండలం నారాయణగూడేనికి చెందిన చింత శ్రీకాంత్ మునగాల నుంచి మోతె మీదుగా ఖమ్మంకు బైక్‌పై వెళ్తున్నాడు. ఖమ్మం–సూర్యాపేట రహదారిపై మామిళ్లగూడెం వద్ద బైక్ అదుపుతప్పి రహదారి వెంట గుంటలో పడింది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు.
- జూన్ 22న పాలకవీడు మండలం శూన్యంపహాడ్ గ్రామానికి చెందిన సాల్మాన్ తన కుమారుడు అరుణ్, మరో వ్యక్తి రామకృష్ణ కలిసి స్కూటీపై సాగర్ రోడ్డు గుండా హాలియా వైపు వెళ్తున్నారు. ధాన్యం లోడుతో వస్తున్న లారీ వీరి స్కూటీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అరుణ్ తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు.
- జూన్ 22న బీబీనగర్ మండలం తిరుమలగిరికి చెందిన తంగెళ్లపల్లి సత్యనారాయణచారి, భువనగిరికి చెందిన రాజు కలిసి పని నిమిత్తం హైదరాబాద్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరిగి రాత్రి ఇంటికి వస్తుండగా గూడూరు టోల్‌ప్లాజా సమీపంలో ముందు వెళ్తున్న కారును అదుపు తప్పి వీరి బైక్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు మృతి చెందారు.
- జూన్ 23న పెద్దఅడిశర్లపల్లి మండలం చిల్కమర్రి గ్రామ స్టేజీ సమీపంలో కోదాడ – జడ్చర్ల జాతీయ రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తున్న మతిస్థిమితం లేని వ్యక్తిని ఓ వ్యక్తి బైక్‌తో ఢీకొట్టాడు. దీంతో గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలై మృతి చెందాడు.
- ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బాబు వలిగొండకు వలస వచ్చి ఐస్‌క్రీమ్‌లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. జూన్ 23న రాత్రి సమయంలో మోటార్ సైకిల్‌పై లోతుకుంట నుంచి వలిగొండకు వస్తుండగా లోతుకుంటలోని పవిత్రాత్మ స్కూల్‌సమీపంలో మోటార్ సైకిల్ అదుపు తప్పడంతో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు.
- జూన్ 24న అడ్డగూడూరు మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన రాకేష్ మరో వ్యక్తితో కలిసి హైదరాబాద్ నుంచి స్వగ్రామం వెళ్తున్నారు. పాటిమట్ల గ్రామం వద్ద ముందు వెళ్తున్న ఎద్దులబండిని అతివేగంతో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రాకేష్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు.
- యాదగిరిగుట్ట మండలం రామాజీపేటకు చెందిన తునిక లక్ష్మి భువనగిరి బస్టాండ్‌లో పూల దుకాణం నిర్వహిస్తోంది. జూన్ 24న దుకాణం తీసేందుకు ఆమె, ఆమె కుమారుడు బైక్‌పై భువనగిరికి వెళ్తుండగా భువనగిరిలోని లక్ష్మీనర్సింహాస్వామి డిగ్రీ కళాశాలకు వద్దకు రాగానే రోడ్డుకు అడ్డంగా వచ్చిన కుక్కను ఢీకొట్టి అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది.
- జూన్ 25న నల్లగొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రానికి చెందిన వెలిదండి శివ తన అత్తగారు ఊరైన గరిడేపల్లి మండలం సర్వారం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. నేరేడుచర్లలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్దకు రాగానే లారీ అతివేగంగా వచ్చి ఇతని బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శివ మృతి చెందాడు.
- జూన్ 25న దేవరకొండ మండలం ఎల్లారెడ్డిబావి గ్రామానికి చెందిన చీకుమెట్ల అభిలాష్ తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అనాజీపురం గ్రామ శివారులో మూల మలుపు వద్ద చెట్టును ఢీ కొని అక్కడికక్కడే మృతి చెందాడు.



కోదాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పూర్తిగా దెబ్బతిన్న కారు (ఫైల్)

- జూన్ 26న పెద్దఅడిశర్లపల్లి మండలం అక్కంపల్లి గ్రామానికి చెందిన జ్యోతయ్య రాత్రి ఘణపురం గ్రామానికి నడుచుకుంటూ వెళ్తుండగా గ్రామ స్టేజీ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు.
- భువనగిరి పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన మహ్మద్ జహంగీర్ పట్టణ శివారులోని ఓ దాబాలో పని చేస్తున్నాడు. జూన్ 26న నల్లగొండ నుంచి భువనగిరి వైపు వస్తున్న నార్కట్‌పల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ముందున్న లారీని ఓవర్ టేక్ చేయబోయి రోడ్డు దాటుతున్న జహంగీర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జహంగీర్ మృతి చెందాడు.
- జూన్ 26న కనగల్ మండలం బచ్చన్నగూడెం గ్రామానికి చెందిన పల్లెబోయిన సత్తయ్య రెండో కమార్తె సూర్యాపేటలో పరీక్ష రాసి కనగల్ బస్టాండ్‌కు వచ్చింది. ఆమెను సత్తయ్య తనబైక్‌పై ఎక్కించుకుని ఇంటికి వెళ్తుండగా ట్రాక్టర్ వేగంగా వచ్చి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సత్తయ్య తీవ్రంగా గాయపడి మృతి చెందాడు.
- జూన్ 26న తెల్లవారు జామున ఏపీలోని కోనసీమ జిల్లా అలుమూరు పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ ముద్దాల అశోక్ అదే స్టేషన్‌లో ఐడీ పార్టీ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యస్వామితో పాటు మరో కానిస్టేబుల్ సుంకర బ్లెసీస్ జీవన్ కలిసి కారులో ఓ కేసులో నిందితులను పట్టుకునేందుకు హైదరాబాద్‌కు బయలుదేరారు. కోదాడ పట్టణ పరిధిలోని దుర్గాపురం జంక్షన్‌లో రోడ్డుపై ఆగివున్న లారీని కారు వెనుకనుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఎస్‌ఐ అశోక్, కానిస్టేబుల్ బ్లెసీస్ జీవన్‌లు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి.
- జూన్ 27న భువనగిరి మండలం నమాత్‌పల్లి గ్రామానికి చెందిన కంబాలపల్లి సాయికిరణ్ గర్భిణీ అయిన తన భార్యను ఆస్పత్రిలో చూపించి తన తల్లిగారి ఊరైన వెంకటాపురానికి పంపించాడు. అక్కడి నుంచి తిరిగి బైక్‌పై వెళ్తుండగా వాహనం అదుపుతప్పి పడిపోయాడు. తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.
- జూన్ 28న పెద్దవూర మండలం నాయనవాని కుంట గ్రామానికి చెందిన మేకల శంకర్ తన బైక్‌పై పెద్దవూర మండల కేంద్రానికి వెళ్లి తిరిగి వస్తుండగా హైదరాబాద్–నాగార్జునసాగర్ ప్రధాన రహదారి దాటుతుండగా మహబూబ్‌నగర్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు.



పెద్దవూర మండల కేంద్రంలో బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు (ఫైల్)

వారం రోజుల్లోనే 11 మంది దుర్మరణం

- ఈనెల 1న కొండమల్లేపల్లి మండలం చింతకుంట గ్రామానికి చెందిన ఐతరాజు అజయ్ మరో వ్యక్తితో కలిసి రాత్రి బైక్‌పై ఇంటికి వస్తుండగా మండల కేంద్రంలోని సాగర్ రోడ్డులో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న ఐరన్ గ్రిల్స్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో అజయ్ మృతి చెందాడు.
- ఈ నెల 2న అస్సాం రాష్ట్రానికి చెందిన జింటు దత్తు చిట్యాల మండలం వెలిమినేడు గ్రామ పరిధిలోని విజయవాడ- హైదరాబాద్ రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తున్నాడు. అదే సమయంలో నార్కట్‌పల్లి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు అతివేగంతో దత్తును వెనుకనుంచి ఢీ కొట్టింది. దీంతో దత్తు అక్కడికక్కడే మృతి చెందాడు.
- ఈనెల 4న ఆత్మకూర్.ఎస్ మండలం గట్టికల్ గ్రామానికి చెందిన మోరపాక భిక్షం, మోనోఐలయ్య మోపెడ్ వాహనంపై వస్తుండగా గట్టికల్ గ్రామ శివారులో ఎదురుగా అతివేగంతో వచ్చిన బైక్ వీరు ప్రయాణిస్తున్న మోపెడ్‌ను ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వీరిద్దరూ మృతి చెందారు.
- ఈనెల 4న హైదరాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సభకు మఠంపల్లి మండలం కిందితండాకు చెందిన కుర్రి శ్రీను కారులో వెళ్లి వస్తుండగా కట్టంగూరు మండలం పామనగుండ్ల గ్రామ శివారులో రాగానే వెనుకనుంచి వచ్చిన లారీ కారును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీను మృతి చెందాడు.
- ఈ నెల 5న బీబీనగర్ మండలం మగ్దూంపల్లికి చెందిన సిల్వేరు సత్యనారాయణ, మల్లమ్మ భార్యభర్తలు. సత్యనారాయణ తన భార్య మల్లమ్మను భువనగిరిలో కూలీ పనికి ద్విచక్రవాహనంపై దించేందుకు బైక్‌పై బయలుదేరాడు. భువనగిరి పట్టణంలోని జంఖన్నగూడెం చౌరస్తా వద్ద బైక్‌పై వారు ఆగగా నల్లగొండ నుంచి భువనగిరి వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు అతివేగంగా వచ్చి వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లమ్మ అక్కడికక్కడే మృతి చెందింది.
- ఈనెల 5న హైదరాబాద్‌లోని మన్సూరాబాద్‌కు చెందిన శంకరమ్మ, ఆమె కుమారుడు రజనీకాంత్‌లు నకిరేకల్ మండలం ఓగోడు గ్రామానికి బంధువుల ఇంటికి వచ్చారు. తిరిగి వెళ్తుండగా కట్టంగూర్ మండల కేంద్రంలో ఆగి ఉన్న లారీని వెనుక ఉంచి ఢీకొట్టారు. ఇద్దరు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతిచెందారు.
- ఈనెల 7న నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని రాయినిగూడెం సమీపంలో రోడ్డు పక్కన ఆపి ఉన్న కారును వెనుక నుంచి కంటైనర్ వచ్చి ఢీకొట్టింది. దీంతో కారు వద్ద ఉన్న ఇద్దరికి గాయాలుకాగా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందారు.
- ఈనెల 7న త్రిపురారం మండలం రాగడప గ్రామం వద్ద ఉన్న మూల మలుపు వద్ద బైక్‌ను ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో ఒకరికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు.

జాతీయ రహదారుల వెంట వాహనాలు నిలపొద్దు



జాతీయ రహదారుల వెంట ఎక్కడపడితే అక్కడ లారీలు పార్కింగ్ చేయొద్దు. అనువైన స్థలంలోనే పార్కింగ్ చేయాలి. ఆగి ఉన్న లారీల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. ప్రమాదాల నివారణ ప్రధాన కూడళ్ల వద్ద వేగ నియంత్రణ చర్యలు చేపడుతున్నాం. ప్రమాదాల నివారణపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. మద్యం మత్తులో డ్రైవింగ్ చేయొద్దు. – నర్సింహ, సూర్యాపేట జిల్లా ఎస్పీ

ఇందిరమ్మ రాజ్యంలో పేదలందరికీ న్యాయం

- తుంగతుర్తి ఎమ్మెల్యే సామేల్

తిరుమలగిరి(తుంగతుర్తి): ఇందిరమ్మ రాజ్యంలో పేదలందరికీ న్యాయం జరుగుతుందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. తిరుమలగిరిలో ఈనెల 14న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నేపథ్యంలో సభ ఏర్పాటు చేయనున్న స్థలాన్ని సోమవారం అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత 15 సంవత్సరాలుగా ఎవరికి రేషన్ కార్డు అందలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందజేస్తుందని తెలిపారు. 14న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా తిరుమలగిరిలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ సభకు 50వేల మంది హాజరవుతారన్నారు. వెనుకబడిన తుంగతుర్తి నియోజకవర్గంలో ఇప్పటికే రూ.1400 కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. మరో రూ.1000 కోట్ల నిధులు కావాలని తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, సూర్యాపేట ఆర్డీఓ వేణు మాధవరావు, ఆర్అండ్‌బీ ఈఈ సీతారామయ్య, డీఈ పద్మావతి, విద్యుత్ శాఖ ఎస్ఈ ఫ్రాంక్లిన్, పార్టీ మండల అధ్యక్షుడు నరేష్, వీరేష్, జమిలాల్, పరమేశ్వర్, చంద్రశేఖర్, అశోక్ రెడ్డి, లక్ష్మయ్య, తహసీల్దార్ హరిప్రసాద్, సర్వేర్ జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.



తిరుమలగిరిలో సభ ఏర్పాటు స్థలాన్ని పరిశీలించిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే సామేల్

పెరుగుతున్న సాగర్ నీటిమట్టం

నాగార్జునసాగర్: సాగర్ నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. శ్రీశైలం జలాశయం నుంచి కుడి, ఎడమ విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా 58 వేల క్యూసెక్కుల నీరు నాగార్జునసాగర్ జలాశయానికి వచ్చి చేరుతోంది. సాగర్ జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.040టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 529.10 అడుగులకు (166.3946 టీఎంసీలు) చేరింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాలకు తాగునీటికి గాను పాలేరు రిజర్వాయర్‌కు ఎడమ కాల్వ హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 3,374 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. హైదరాబాద్ తాగునీటికి గాను ఏఎమ్మార్పీకి 1350 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో 58,780 క్యూసెక్కులు ఉండగా ఔట్‌ఫ్లో 4,724 క్యూసెక్కులు.

చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అరెస్ట్

- నిందితుల నుంచి ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, 1250 గ్రాముల గంజాయి స్వాధీనం

చిట్యాల: జల్సాలకు అలవాటై, సులువుగా డబ్బు సంపాదించేందుకు గంజాయి విక్రయించటంతో పాటు తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను చిట్యాలలో పోలీసులు అరెస్ట్ చేశారు. నార్కట్‌పల్లి సీఐ కొగూరి నాగరాజు సోమవారం చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మామిడి రవికుమార్‌తో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌లోని బీఎస్‌రెడ్డి నగర్‌కు చెందిన వీఐ సేల్స్ మేనెజర్‌గా పనిచేస్తున్న దండుగుల శివకుమార్, మహబూనగర్ జిల్లా వెల్దండ గ్రామానికి చెందిన ఆటో డ్రై వర్ తలారి మనోజ్‌లు జల్సాలకు అలవాటు పడ్డారు. సులువుగా డబ్బు సంపాదనకు గాను గత కొంతకాలంగా గంజాయిని విక్రయించటంతో పాటు తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నారు. గత నెల 30న చిట్యాల మండలంలోని వట్టిమర్తి గ్రామంలో కెనెరా బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తూ చిట్యాలలో నివాసం ఉంటున్న గుంటూరి చైతన్య ఇంట్లో చోరీ చేయగా బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ల్యాప్‌టాప్ తోపాటు మూడు వాచ్‌లు, సెల్‌ఫోన్ చోరీ జరిగినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందించిన పోలీసులు చోరీ ఘటనపై నిఘా వేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో సోమవారం చిట్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో ఎక్స్‌రోడ్డు వద్ద ఆటోలో అనుమానాస్పదంగా తిరుగుతున్న శివకుమార్, మనోజ్‌లను ఎస్ఐ రవికుమార్ పోలీసు సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. వారి వద్ద గల 1250 గ్రాముల గంజాయిని విక్రయించేందుకుగాను ప్రయత్నిస్తున్నట్లు తెలియటంతో పాటు చిట్యాలలో చైతన్య ఇంట్లో చోరీకి పాల్పడినట్లు అంగీకరించారు. వీరి వద్ద ఆటోతో పాటు ల్యాప్‌టాప్, మూడు వాచ్‌లు, సెల్‌ఫోన్, ఇనుప రాడ్‌తో పాటు 1250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. యువకులను చాకచక్యంగా పట్టుకున్న చిట్యాల ఎస్ఐ రవికుమార్, హెడ్ కానిస్టేబుల్స్ మధు, రాంబాబు, రైటర్ వెంకన్న, కానిస్టేబుల్స్ ఖలీమ్, సాయి, ఆనంద్, జానొరెడ్డిలను సీఐ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నాగరాజు

ప్రజావాణిలో ఒంటిపై పెట్రోల్ పోసుకున్న రైతు

- తన పేరున భూమి మార్చడం లేదని ఆవేదన



రైతు ఆగిరెడ్డి నుంచి పెట్రోల్ బాటిల్ లాక్కుంటున్న కానిస్టేబుల్

సాక్షి, యాదాద్రి : యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం నాగినేనిపల్లికి చెందిన రైతు ఆగిరెడ్డి సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ ఎదుటే ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అక్కడే ఉన్న ఎక్సైజ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ రైతు చేతుల్లోంచి పెట్రోల్ బాటిల్ తీసుకుని హాల్ బయటకు పంపించారు. అనంతరం కలెక్టర్‌కు రైతు తన గోడు వెళ్లబోసుకున్నారు. తన రెండు ఎకరాల మూడు గంటల భూమి ఇతరుల పేరు మీద వెళ్లిందన్నారు. తన పేరు మీద చేయాలని మూడు సంవత్సరాల నుంచి రెవెన్యూ అధికారులకు దరఖాస్తులు చేసుకున్నా స్పందించడం లేదన్నారు. భూ భారతిలో భాగంగా దరఖాస్తు చేసుకున్నప్పటికీ తన పేరు మీద భూమి చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. భూమిని నమ్ముకొని జీవిస్తున్న తనకు ఇలాంటి పరిస్థితి ఎదురవడంతో తీవ్ర మానసిక ఆవేదన గురవుతున్నానని రైతు ఆగిరెడ్డి అన్నారు. కాగా, నిబంధనల ప్రకారం ఆగిరెడ్డి సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను భువనగిరి కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు.

లంచం డిమాండ్.. డిప్యూటీ తహసీల్దార్ అరెస్టు

- సీజ్ అయిన లారీలను విడిపించేందుకు రూ.లక్ష డిమాండ్
- ఏసీబీకి ఫిర్యాదు చేసిన బాధితుడు
- డీఎస్ఓ కార్యాలయం, డీటీ ఇంట్లో సోదాలు

నల్లగొండ: సీజ్ అయిన లారీలను విడిపించేందుకు డబ్బులు డిమాండ్ చేసిన మిర్యాలగూడ డిప్యూటీ తహసీల్దార్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. మిర్యాలగూడ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న షేక్ జావెద్ పౌర సరఫరాల శాఖకు డిప్యుటేషన్‌పై వెళ్లారు. పీడీఎస్ బియ్యాన్ని ఏపీకి తరలించే క్రమంలో పోలీసులు సీజ్ చేసిన లారీలను విడిపించేందుకు నెల రోజుల క్రితం లారీల యజమానిని డిప్యూటీ తహసీల్దార్ రూ.లక్ష డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈమేరకు డీటీ జావెద్‌పై కేసు నమోదు చేశారు. అతను నెల రోజులు విధులకు సెలవు పెట్టి అందుబాటులో లేకుండా పోయాడు. దీంతో అధికారులు అతని కోసం వెతుకుతున్నారు. నెల అయినా కూడా విధులకు హాజరుకాకపోవడంతో విధుల్లో చేరాలని లేదా సంజాయిషి ఇవ్వాలని నోటీసులు పంపారు. అయినా స్పందించకపోవడంతో పది రోజుల క్రితం జావెద్‌ను కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఆదివారం అతడిని ఏసీబీ అధికారులు నల్లగొండలో అరెస్టు చేశారు. సోమవారం ఉదయం నల్లగొండ డీఎస్ఓ కార్యాలయం, జావెద్ ఇంట్లో ఏక కాలంలో సోదాలు నిర్వహించి ఫైళ్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ జగదీష్ చంద్ర మాట్లాడుతూ.. సీజ్ అయిన లారీలను విడిపించేందుకు డిప్యూటీ తహసీల్దార్ వారిని సంప్రదించి రూ. లక్ష డిమాండ్ చేశారని, రూ. 70 వేలకు ఒప్పుకున్నప్పటికీ బాధితుడు డబ్బులు ఇచ్చేందుకు ఇష్టం లేక తమను ఆశ్రయించాడని పేర్కొన్నారు. డీఎస్ఓ కార్యాలయం, ఇంట్లో సోదాలు చేసామని అవి పూర్తయిన తర్వాత డిప్యూటీ తహసీల్దార్‌ను కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.



జావెద్

చోరీ చేసి ఆమ్లెట్ వేసుకుని తిని..

- అంగన్‌వాడీలో కోడిగుడ్లు, బియ్యం అపహరించిన దుండగులు



విచారణ చేస్తున్న సూపర్‌వైజర్ అన్నపూర్ణ

ఆత్మకూర్.ఎస్ (సూర్యాపేట) : ఆత్మకూర్ మండల పరిధిలోని నెమ్మికల్ అంగన్‌వాడీ రెండవ కేంద్రంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి, కొన్ని కోడిగుడ్లను కేంద్రంలోనే ఆమ్లెట్లు వేసుకొని తిన్నారు. కేంద్రం టీచర్ రేపాక పద్మ తెలిపిన వివరాల ప్రకారం.. కొందరు ఆకతాయిలు రాత్రి సమయంలో ప్రభుత్వ పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రం తాళాలు పగులకొట్టి లోపలికి చొరబడ్డారు. కోడిగుడ్లు, బియ్యం, పప్పు, ఆయిల్ ప్యాకెట్లు తీసుకెళ్లారు. వస్తువులను చిందరవందర చేశారని తెలిపారు. సమాచారం తెలుసుకున్న సూపర్‌వైజర్ అన్నపూర్ణ కేంద్రాన్ని పరిశీలించారు. చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఆధార్ సెంటర్‌లో సామగ్రి అపహరణ

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉన్న ఆధార్ సెంటర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన సోమవారం వెలుగు చూసింది. రాజు అనే వ్యక్తి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో గత ఆరు సంవత్సరాలుగా ఆధార్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. శనివారం రాత్రి సమయంలో సెంటర్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు ఆదివారం కావడంతో సెంటర్ తీయలేదు. సోమవారం ఉదయం 10గంటల సమయంలో సెంటర్ వద్దకు చేరుకున్నాడు. వేసిన తాళం పగులకొట్టి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా అందులోని వస్తువులు చిందరవందరగా ఉన్నాయి. చోరీ జరిగిందని గ్రహించి వన్ టౌన్ పోలీసులకు సమాచారం అందించాడు. వారు అక్కడకు చేరుకుని నల్లగొండ నుంచి క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. రూ.30 వేల నగదుతో పాటు మొత్తం రూ.4లక్షల విలువైన కంప్యూటర్లు, లాప్‌టాప్‌లు చోరీకి గురయ్యాయని బాధితుడు వాపోయాడు. రాజు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వన్ టౌన్ సీఐ మోతీరామ్ తెలిపారు.

రెండు ట్రాక్టర్లు, కారు ఢీ.. పది మందికి గాయాలు

గరిడేపల్లి : రెండు ట్రాక్టర్లు, కారు ఢీకొనగా పది మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన గరిడేపల్లి మండలం కీతవారిగూడెం గ్రామ శివారులో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ నుంచి మిర్యాలగూడ వైపుకు వస్తున్న కారు ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ప్రమాదశాత్తు ఢీ కొన్నాయి. ఇదే సమయంలో ట్రాక్టర్ వెనుక మరో ట్రాక్టర్ ఉండడంతో ముందు ట్రాక్టర్‌ను ఢీకొనగా ఈ ప్రమాదంలో కారులో ఉన్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన పది మంది తీవ్ర గాయాలపాలయ్యారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ నరేష్ వెంటనే పోలీస్ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకొని కారులో ప్రయాణిస్తున్న వారంతా జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. క్షతగాత్రుల్లో కోదాడకు చెందిన, జార్ఖండ్‌కు చెందిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకు మృతి

- మృతుల్లో ఒకరు ఆర్మీ జవాన్

తిప్పర్తి : రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకు మృతి చెందిన సంఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలోని రాయినిగూడెం సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. తిప్పర్తి ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం వరగాని గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ ఉదయగిరి ఉమామహేశ్వరరావు (44) ఆర్మీలో సుబేదార్‌గా రాజస్తాన్‌లో పనిచేస్తున్నాడు. భార్యపిల్లలతో కలిసి అక్కడే ఉంటున్నారు. సెలవుల నిమిత్తం హైదరాబాద్ వచ్చిన వారు.. అక్కడి నుంచి స్వగ్రామమైన వరగాని గ్రామానికి వెళ్లేందుకు కుమారుడు ఉదయగిరి అభిషేక్ (22), భార్య అనురాధ, కుమార్తె కుస్మతో కలిసి కారులో బయల్దేరారు. తిప్పర్తి మండలం రాయినిగూడెం సమీపంలో కారులో రిపేరు రావడంతో రోడ్డు పక్కన ఆపారు. అదేసమయంలో వెనుక నుంచి కంటైనర్ వాహనం వేగంగా వచ్చి కారును ఢీకొట్టింది. దీంతో కారు వద్ద ఉన్న నాగేశ్వర్‌రావు, అభిషేక్‌కు బలమైన గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందారు. భార్య అనురాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శంకర్ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

త్రిపురారం : ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన త్రిపురారం మండలంలోని రాగడప గ్రామ పంచాయతీ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. దామరచర్ల మండలంలోని తిమ్మాపురం గ్రామ పరిదిలోని తూర్పుతండాకు చెందిన దీరావత్ నర్సింహ(30) తుంగపాడు నుంచి అడవిదేవులపల్లి వైపు వెళ్తున్న సమయంలో రాగడప గ్రామం వద్ద ఉన్న మూల మలుపు వద్ద ఎదురుగా ట్రాక్టర్ వచ్చి ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న నర్సింహ రోడ్డుపై పడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడకు తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ నరేష్ తెలిపారు.